*బొబ్బిలి బెబ్బులి అంటే పాపారాయుడేనన్నది అందరికీ తెలిసిన సంగతి. చరిత్రలో యింకో ఆడ బెబ్బులి వుంది. ఆమె ఎవరు?*

చామన చాయ శరీర కాంతి! నలనల ని కేశపాశాలు, విశాలమయిన నేత్రాలు, ఎత్తయిన నుదురు, మెడమీద మూపురంలా ఎత్తయిన కండరాలు, కఠినతరమయిన వక్షోజాలు.



# బొబ్బిలి బెబ్బులి

## లల్లాదేవి

విశాలమయిన వక్షస్సు. ఇనుపముద్దల్లాంటి కండరాలతో మెలితిరిగిన భుజాలు. వ్యాయామశ్రమ వల్ల శుష్కించిన ఉదరభాగము. సన్నని నడుము నల్లని పిక్కలు. అనాచ్ఛాదితంగాడున్న పాదాలు!

ఆమె పేరు కమలక్క. కోమటివారింట పుట్టిన ఆడపడుచు! పౌరుష పరాక్రమాలకు పెట్టింది పేరు అని బొబ్బిలిని గోపాలకృష్ణ రంగారావు పాలిస్తున్న రోజులు. దెబ్బయి ఆరు మన్యాలకు ఏలిక అయిన విజయరామరాజు బొబ్బిలి రాజ్యం వైపు ఆకలిగొన్న పులిలాగ గుర్రున చూస్తున్న రోజులు!

బొబ్బిలి వారికీ. విజయనగరం వారికీ సరిహద్దుల మీద గడ్డ నీటి కోసం వచ్చిన తగాయిదాలు చిలికి చిలికి గాలివాన అవుతున్న తొలినాళ్ళు!

కోడిపందాలలో గెలిచి బొబ్బిలివారు గొప్ప కోసం కోడి స్తంభమనే పేరుతో ఒక విజయధ్వజాన్ని పాతుకోవటంవిజయనగరం వారికి కన్నెర్ర అయిన దినాలు.

నిజాము సలాబత్ జంగ్ మహారాష్ట్రుల మీది యుద్ధంలో విజయం సాధించేందుకు ఫ్రెంచి దొర డూప్లేకు అమ్ముడు పోయిన కాలమది.

పేష్ కష్ కట్టమంటూ వరవడి చేస్తున్నాడు డూప్లే! అతని బంటుగావున్న రంగరాయపిళ్ళె శ్రీకాకుళం, రాజమండ్రి కృష్ణా, కొండవీడు మండలాలమీద దొరకు యెక్కాలు చెప్తున్నాడు.

సాగర తీరమండలాల పేరు వింటే మండిపడుతున్నాడు డూప్లే. బుస్సీని. ఫ్రెంచి సైనికాధికారి హెన్రీలాని పిలిచి మన్యభూముల్లో శిస్తు వసూలు చేసుకుని రమ్మని పంపించాడు.

నైజామునించి సైన్యాలు ఓరుగల్లు. కొండపల్లి మీదుగా రాజమహేంద్రవరం దరిదాపుల్లోకి వస్తున్న సమయమది. యుద్ధం కనుచూపు మేరలో పొంచివుంది.

బొబ్బిలికి అటువంటి దుర్దశ ప్రాప్తించిన రోజులు. కమలక్క కోమటుల ఇంటి ఆడపడుచు. కోమటులంటే వారు గోమతులు.

జైన సంప్రదాయాలు చివికి జీర్ణమయిపోయి హిందూ సంప్రదాయాలలో కలిసిపోతున్నాయి. ఆర్యులతో పాటు క్రౌంచరంధ్రం (కైబర్ కనుమ) నించి భరతభూమిలో అడుగు పెట్టినవారు గోమతులు.

కొంతకాలం తూర్పున మగధ, అహిఛత్ర, నలంద రాజ్యాలలోనూ, పశ్చిమాన ఉజ్జయిని, వైశాలి, తక్షశిల రాజ్యాలలోనూ నివశించారువారు.

ఆ తరువాత ఆర్య నాగరికత గణ వ్యవస్థల్ని రూపుమాపుతూ రాచరికాన్ని రూపొందించింది. గోమతులు కూడా ఆర్యులతో పాటు దక్షిణాపథానికి పయనించారు. వింధ్య పర్వతాలనుదాటి, నర్మదా, తపతీ పీఠభూముల్ని దాటి, మహానదిని దాటి, వంశధార, ఇంద్రావతి నదుల్నిదాటి పాలకొండ, పాపికొండ, సూదికొండ ప్రాంతాలకు తరలివచ్చారు.

అట్లా వచ్చినవారిలో కొందరు విజయనగరంలోనూ, బొబ్బిలిలోనూ స్థిరపడిపోయినారు. బొబ్బిలిలో స్థిరపడిపోయిన గోమతుల కుటుంబాల యింటి ఆడపడుచు కమలక్క!

ఆమె వుండేది ఎప్పుడూ అంతఃపురాలలోనే! స్నేహం చేసేది వెలమకాంతలతోనే! ఇంటి ముఖం చూడదు. రాచకార్యాల మీద రాజుకన్నా ఎక్కువ ఆసక్తి ప్రదర్శిస్తుంది. అంతఃపుర సంరక్షణల గురించి రాణికన్నా ఎక్కువ జాగ్రత్తలు తీసుకుంటుంది.


దరఖాస్తులు కోరబడుచున్నవి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే రిజిష్టరు చేయబడినది

ఉద్యోగములు : 1. Clerks. 2. Cashiers. 3. Accountants. 4. FieldMan 5. Field Asst. 6. Sub Asst. 7. Field Mastry. 8. Craft Teachers.

విద్యార్హత : 7th Pass, S.S.C., Inter, Degree Pass or Fail.

జీతము : రు. 480/- నుండి రు. 720/-ల వరకు.

పై విద్యార్హతలు గలవారు అగ్రికల్చర్, అకౌంటెన్సీ, కోర్సులందు Regular/Postal ద్వారా శిక్షణ పొంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షలందు ఉత్తీర్ణులైనవారు పై ప్రభుత్వోద్యోగములలో నియమింపబడుటకు అర్హులు. రెగ్యులర్ విద్యార్థులకు భోజన, హాస్టలు వసతి కలదు. దరఖాస్తు ఫారము, పూర్తి వివరములకు 12 రోజులలోగా 35 పైసల పోస్టు స్టాంపులు 3 ఈ క్రింది అడ్రసుకు పంపి పొందవచ్చును.

Principal

S.N.A.T. Training Institute, Addanki-523201, Prakasam Dt A.P.





'Raiso'

ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★100% పాలియస్టర్ చీరలు.
★ఫుల్‌వాయిల్, ఆఫ్‌వాయిల్ చీరలు
★షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★డ్రస్ మెటీరియల్సు, 2×2 రూబియాలాన్సు
★స్కూలు యూనిఫారంలు _వగైరాలకు
విజయ షోరూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షోరూమ్
J.D. హాస్పటల్ రోడ్డు,
గవర్నరుపేట ......... విజయవాడ-2.

శుభవార్త

డాక్టర్లకు సాధ్యముకాక వదిలి వేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. లావుపాటివారు సన్నగను, బలహీనులను బలవంతులుగను చేయబడుదురు. మధుమేహము, రక్తపుపోటు, కుష్ఠు, బొల్లి, క్యాన్సరు సంతానంలేని వారు కూడా శ్రీ యోగిగారి కాయకల్ప చికిత్సవలన సంపూర్ణ ఫలితము పొందగలరు. ఈ చికిత్స వలన దేహము లోని అన్నివ్యాధులు తొలగి పోవుటయేగాక నూతన యవ్వనము కలుగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రు. 4-00లు యం.ఓ. పంపవలయును.

మేనేజర్,
శ్రీ యోగాశ్రమ్,
పెదవాల్తేరు P.O.,
విశాఖపట్టణము-17.

రావ కుటుంబంవారు ఆమెను ఎంతో శ్రద్ధాసక్తులతో గౌరవిస్తారు. ఆమె మేలుపెట్టని వ్యవహారాలు కాని, సలహా యివ్వని సమస్యలు కాని లేవు.

బొబ్బిలి సామ్రాజ్య అధినేత అయిన గోపాలకృష్ణ రంగారావు దొరకు ఎన్నో సలహాలిచ్చిందామె యుద్ధరంగాలలో విజయాలకు కేవలం పౌరుష పరాక్రమాలు చాలవు. అధునాతనమయిన ఆయుధాలను సమకూర్చుకోవాలి అని చెప్పింది. సలాబత్‌జంగ్ ఎప్పుడయినా ప్రమాదకారి అని హెచ్చరించింది. దూప్లే మంచివాడయినా మన్యాలమీద ఎక్కులు చెప్తున్న రంగరాయపిళ్ళే ఎప్పుడో బొబ్బిలివారిని కొంప ముంచుతాడని కూడా జోస్యం చెప్పింది.

ఎన్ని చెప్పినా గోపాలకృష్ణ రంగారావు దొర ముందుగా తగు జాగ్రత్తలు తీసుకునే సూచనలేవీ కన్పించలేదు. "వెలమవీరుల పౌరుష పరాక్రమాల ముందు పరాసు మూకల ప్రతాపమెంత?" అని తేలికగా నవ్వేశాడు.

కమలక్కకు గుండెలు మండిపోతున్నాయి పరాసు ఫౌజు రాజమండ్రిలో విడిద దిగింది. గోరుందొర కబురు పంపాడు. బొబ్బిలివారు బకాయిపడిన మూడు లక్షల పేష్కష్ చెల్లించవలసిందని.

దెబ్బయి ఆరు మన్యాలకు ఏలికఅయిన విజయరామరాజు ఫ్రెంచివారికి సభా కట్నాలు చెల్లించేందుకు పోతూ బొబ్బిలి వారికి కబురుపెట్టాడు.

"రాజమండ్రిలో ఫ్రెంచిదొర విడిది చేశాడు. దెబ్బయ్యారు మన్యాలకు దొరగా సభా కట్నాలు చెల్లించేందుకు మేము బయలుదేరుతున్నాము. చిల్లర తగవుల గురించి మనమంతా మర్చిపోదాం. బుస్సీ హెన్రీలా దొరలు వెళ్ళిపోయాక మన తగువుల గురించి చూసుకోవచ్చు. కనుక మీరుకూడా రావలసింది" అని బొబ్బిలికి వర్తమానం పంపాడు. కళింగ పెదరాజు విజయరామరాజు ఆ వార్తను అందుకున్న వెలమదొరలు అదను వచ్చిందని కలసిపోవలసింది.

కాని అలా చేయలేదు, బెట్టుచేశారు.

పైగా వర్తమానం తెచ్చిన పరకావారిని పరాభవించారు. పరకావారి చెంపలు కొట్టాడు వుద్దండ పిండమూ, దుందుడుకు వీరుడూ అయిన వీర వెంగళరాయుడు.

ప్రభువు అయిన గోపాలకృష్ణ రంగారావుకీ చేష్టలు నచ్చలేదు. అయినా తమ్ముడుచేసిన పని పట్టించుకోలేదు. మందలించనూలేదు. పెద్దలంతా బాధపడినా మౌనం వహించారు.

## కోకిల పాట

ఉదయ సాయంత్రాల రెక్కలమీద
ఎగిరి
దుష్ట జ్ఞాపకాల్ని శిష్ట ఆశల్ని
కలపోసుకుని
కొత్త సంవత్సరం వస్తోంది !
బీళ్ళల్లోనైతం కొత్త చిగుళ్ళు
మొలకెత్తుతున్నాయి !
నిశ్చేతనంగా పడివున్న మైదానాల్లో
వసంతం విస్తుల తేజాన్ని కురుస్తోంది
నా హృదయం ఉత్సాహాల
ఝంఝుల్ని వీస్తోంది !
రెక్కలు విదుల్చుకుని రాగాలు
పైకెగురుతున్నాయి
శిశిరపు కర్కశత్వం తర్వాత
సూర్యుని వెలుగు మెతగా
పరుచుకుంటోంది !
మామిడి చెట్టునీడలు కోకిల పాటను
నెమరు వేసుకుంటున్నాయి
గూటిలో నిద్రపోతున్న దీపాన్ని
వెలిగించినట్లు
ఉదయం చల్లని గాలి ఊపిరిలో
చైతన్యం పోస్తోంది ;
వసంతం ప్రకృతిపై చేసే సంతకాల్ని
కళ్ళతో విని చెవులతో చూసేవాడే
వసంతం విందుకు అర్హుడు !

—శశికాంత్ శాతకర్ణి

తాను పంపిన పరకావారికి పరాభవం జరిగిందని తెలుసుకున్న కళింగ పెదరాజు విజయరామరాజు గుండె గాయపడింది. పరకావారిని తాను పంపాడు- వారికి పరాభవం జరిగితే తనకు జరిగినట్లు కాదా అని భావించాడు. కోపగించాడు.

"బొబ్బిలివారి అంతం చూస్తాను. బొబ్బిలికోట గోడల్నిదున్నించి ఆముదాలు పండిస్తాను. బొబ్బిలి భూముల్లో పొగ మొక్కలు నాటిస్తాను. వెలమ వనితల్ని నా సైనికులయిన బొందిలీ వీరులకు వారవనితలుగా బహూకరిస్తాను" అని శపథం చేశాడు.

ఈ వార్త బొబ్బిలికి చేరింది.

ఎక్కడెక్కడివార్తలూ ముందుగా కోమటివారింటి ఆడపడుచు అయిన కచు లక్కకు తెలుస్తాయి. ఆమె అంతఃపుర కాంతలకు ఆప్తురాలు. ప్రభువులకు ఆత్మీయురాలు. చిన్న పెద్దలందరికీ సన్నిహితురాలు. బొబ్బిలికి శనిరోజులు దాపురించినాయని గోలపెట్టటం ప్రారంభించిందామె. బొబ్బిలి కోటలోవున్న గోపాల దేవుని ఆలయానికి వెళ్ళిందామె. స్వామి ముందు సాగిలి మొక్కింది.

"గోపాలదేవా! ఎంతకు తెచ్చిపెట్టినావయ్యా! డెబ్భయి ఆరు సున్యాలకు ఏలిక అయిన కళింగ పెదరాజుతో బొబ్బిలివారికి వైరం ఏమిటి?

బుస్సీ, హైదరీలా దొరలు రాజమహేంద్రంలో విడిసినారన్న వార్త విని కళింగ పెదరాజు వైరాన్ని మరచి వార్త పంపినాడుకదా! ఈ దుందుడుకు వీర వెంగళరాయడు వారినెందుకు పరాభవించాలి?

పరకా వారిని చెంపలు కొట్టిపంపిస్తాడా? రాయవారుల్ని ఎవరైనా అవమానిస్తారా? బొబ్బిలి వెలమ వీరులకు రాజనీతి తెలియదన్న వార్త వాడ వాడలకు వ్యాపించదా?

వీరవెంగళరాయడు వయసులో చిన్నవాడు. అన్నగారయిన గోపాలకృష్ణరంగారావు ప్రభువుకదా! వారికి తెలియదా?

ఇలగంటి నరసారాయడు మేధావి అయిన మంత్రికదా? వారికి తెలియదా? ఈ చేష్ట తప్పు అని ఖండించటం వారి కర్తవ్యం కాదా? గోపాల దేవా? కోడి స్తంభం ఊగిసలాడుతోంది. ఏదో కీడు మూడతుంది. ఈ కోటను ఎలా కాపాడుకుంటావో నీదే భారందేవదేవా!" అంటూ ప్రార్థించిందామె.

ఆలయ ప్రాంగణంలోవున్న పగడ చెట్టు క్రింద కూర్చుని ఆలోచనా నిమగ్నురాలు అయింది. ఎలాగయినా ఈ ఉపద్రవాన్ని తప్పించాలని ఎంతగానో ఆరాటపడింది.

అందరూ మౌనం వహిస్తే అన్నంత పనీ చేసి తీరుతాడు కళింగ పెదరాజు! అతడు ఎంత భారీ శరీరం కలవాడో అంత మేధాసంపత్తి కలవాడు. కౌటిల్యం లేనిదే రాజనీతి లేదు.

బుస్సీకి ఎక్కులు చెప్తాడు. గోరం దొరతో కొండాలు పల్లిస్తాడు. వారంతా బొబ్బిలికి విరోధులయితే వెలమ వీరులకు నిలువనీడ ఎక్కడ? ఎక్కడ??

ఈ విషయంలో మిన్నకుంటే ప్రమాదాలు ముంచుకొస్తాయని తొందరించింది మనసు. ఏదో చెయ్యాలి. చేసెయ్యాలి. ఉన్నచోటునించి ఒక్క వుదుటున లేచిందామె.

త్వరలో విడుదల!
విద్వాన్ దేవరకొండ చిన్నికృష్ణశర్మ గారిచే
తేనెతేటవంటి తేట తెనుగులో వ్రాయబడిన
సంపూర్ణగ్రంథం
బాలల వచన భారతం
18 పర్వాలు 18 భాగాలుగా
మిమ్మల్ని అలరించే రంగుల హంగులతో వెలువడుతున్నాయ్!
పూర్తి సెట్ వెల: రు 170/-లు
ఏప్రియల్ 15 తేదీ లోగా పైకం పంపువారికి రు 170/-ల సెట్టు రు 140/-లకే!
త్వరపడండి!
MVKR
కళ్యాణి పబ్లిషింగ్ హౌస్
ఫోన్ : P.P. 63322 • మ్యూజియం రోడ్ • విజయవాడ-520002






## పవిత్ర రుద్రాక్ష

1 నుండి 14 ముఖములుగల పవిత్ర రుద్రాక్షలు, చందనం, తులసి, పసుపు పచ్చ మరియు గులాబిరంగుల జపమాలలు శిలాజిత్తు, గోరోచనం, దక్షిణావర్త శంఖము, అదృష్టమును కల్పించే శ్రేష్టమైన రాళ్ళు లభించును. కోరినవారికి ధరలపట్టి పంపబడును. హిందీ లేక ఇంగ్లీషులో వ్రాయండి.

**Shree Jagdamba Bhawan**
(A. J.) SONEPAT-131001.

## నెలకు రు. 1,000/-లు సంపాదించండి

ఎలక్ట్రిక్ గైడ్ 10/-. ఫొటోగ్రఫీ టీచర్ 10/-. 100 బొమ్మలతో సెక్స్ జీవితం 10/-. 88 బొమ్మలతో కోకోశాస్త్రము 15/-. ట్రాన్సిస్టర్ రేడియో గైడ్ 10/-. రేడియో గైడ్ 10/-. టైలరింగ్ & కటింగ్ గైడ్ 10/-. డ్రాయింగ్ & పెయింటింగ్ 10/-. 300 కాటేజి ఇండస్ట్రీస్ గైడ్ 20-/. 350 ఎంబ్రాయిడరీ డిజైను 8/- ప్రతి ఒక్కటి పోస్టేజి 1-50 అదనము.

ILFA BOOK DEPOT (A త)
Rafatganj, Aligarh.



దివ్యస్మృతి 3-4-1974

సీతా! నిత్యం నిన్ను స్మరిస్తూ
నీ మరణాన్ని విస్మరిస్తున్న
నీ బిడ్డలు — రవి, రమణ.
నీ అల్లుడు, కూతురు — చక్రపాణి, వసంతి.
నీ మనవడు — నవీన్ కుమార్.
జీవచ్ఛవం — నీ రామమూర్తి.
సెక్షన్ హెడ్, ఎల్.ఐ.సి., మదనపల్లె

ఆలయ ప్రాంగణందాటి యివతలకు రాగానే వెంగళరాయడు యెదురయినాడు. వీరకాసె బిగించి, పగడాల కంచుకం తొడిగి హనుమంత తలపాగా మీద హేమంత బిరుదులు చెక్కి, చువ్వీ చెేతిలో బిగియపట్టి, నడుము పటకాలూ పదునైన పిడిబాకు చెక్కి బయలుదేరాడు వెంగళరాయడు.

అతని ముఖంలో ఆనంగం తాలూకు వెలుగురవ్వ. మీసంచాటున దాగివున్న తెల్లని దరహాసరేఖ!

అదంతా చూసి కమలక్క ఆవేదన రవంత శాంతించినట్లు అయింది. దుఃఖం వుపశమించింది కాబోలు.

చిరునవ్వుతో పలకరించింది.

"ఏమయ్యా! మరదీ! బ్రహ్మచారి వయినా భలే పసందుగా అలంకరించుకున్నావు. ఎంవాకా పయనం? చువ్వీ చెేతిలో ఉన్నదన్నమాటేకాని చిరునవ్వు చెరగలేదు. రవి కిరణాలకు తళతళలాడే హేమంత బిరుదులతో పోటీ పడుతున్నట్లుగా వుందయ్యా నీ ముఖకాంతి. మొత్తం మీద ఏదో రసవత్తరమయిన ఘట్టంలో పాల్గొనబోతున్నావు. నీ తొందర చూస్తే అనుమానంగానే వుంది.

నీవు వెళ్ళేచోట నీకు ఆనందం కలగాలని గోపాలదేవుని ప్రార్థిస్తాను. కాని ఎక్కడకు పోతున్నావో నాకుకూడా చెప్పి వెళ్ళరాదూ! విని ఆనందిస్తాను." అంటూ పలకరించింది కమలక్క.

"వదినగారూ! మీరు ఎదురవుతారని అనుమానంగానే వుంది. తీరా ఎదురయ్యాక తప్పుకుపోవటం తగని పని. వేట పనిమీద వెళ్ళుతున్నాను. ఆశీర్వదించి దారి యిస్తారా?" అన్నాడు వెంగళరాయడు. ముఖంమీద చిరునవ్వు చెరగలేదు.

"వేటపని మీద పోతున్నావా మరదీ! వేడుకయిన అలంకారాలు చేసుకుని బయలుదేరితే హీరాదేవి దగ్గరకు పోతున్నావేమో అనుకున్నాను. నీకు నాట్యమంటే అభిలాష కదా! పోతేపోయావు కాని, మళ్ళా ఎప్పుడు తిరిగొస్తావో చెప్పు" అన్నదామె దారి యివ్వకుండానే!

వెంగళరాయడు దూకుడు గుర్రం మీద ఎక్కి కూర్చున్నట్టుగా వున్నాడు. భద్రగజం మీద కూర్చుంది కమలక్క.

ఇద్దరికీ పొంతన ఎలా కుదురుతుంది?

వెంగళరాయడు వెళ్ళిపోవాలనీ, కమలక్క కాదు కూడదనీ అభిప్రాయంలో వున్నారు.

"తిరిగి వచ్చే సంగతి వెళ్ళేటప్పుడే ఎలా తెలుస్తుంది వదినగారూ! అక్కడ రవంత ఆలస్యం కావచ్చు. గురిపెటిన ప్రాణి పరుగు లంకించుకుని పారిపోవాలని ప్రయత్నం చేస్తే నేను దూరాభారం వెంబడించాల్సి వస్తుందేమో!" అంటూ అర్థవంతమయిన పరిభాషలో చెప్పాడు వెంగళరాయడు.

"హీరాదేవి ఎక్కడకూ పోదులేవయ్యా! నాట్యరాణులెప్పుడూ రసజ్ఞులయిన ప్రేక్షకులకోసం ఎదురు చూస్తారు. ఎందుకూ మరదీ బుకాయిస్తావు. నీవు వేటాడదలుచుకున్న ప్రాణి ఒకవాసనితేకదా! ఆ ప్రాణులు పారిపోవు. కావాలని వలలో పడతాయి. కవ్వించి వలలో పెడతాయి.

ఈ రెండూ ఇదివరకే జరిగిపోయిన ఘట్టాలు కాబట్టి నువ్వుపరుగులెత్తవలసిన అవుసరం లేదు ఇక దూరం పరుగెత్తే విషయమంటావా?

ప్రేమ వ్యవహారంలో దూరంకన్నా మధురమయిన ఘట్టం లేదు" అంటూ నవ్వింది కమలక్క.

ఇహ ఆవిడ తనను విడిచిపెటదని అర్థమయిపోయింది వెంగళరాయనికి. అవతల నాట్యరాణి హీరాదేవి ఎదురు చూస్తూ వుంటుంది.

అసలే మొండిఘటం. అలక పాన్పు ఎక్కిందంటే పారిజాతాపహరణంలో కృష్ణుడికి పట్టినగతే తనకూ పడుతుంది.

అయినా కమలక్క మాటమీరే శక్తి తనకులేదు.

నిలిచిపోయినాడు. దూకుడుగా గుర్రం దిగిపోయినాడు.

"చెప్పండి వదినగారూ!" అన్నాడు ప్రశాంతంగా?

కమలక్క కంఠం అంతలోకే రవంత జీరపోయింది.

"బొబ్బిలికి శనిరోజులు దాపురించినాయి మరదీ! పరకావారిని నీవు పరాభవించి పంపావుకదా! దాంతో రెచ్చిపోయినాడు కళింగ పెదరాజు.

పరాసుమూకలు పదివేల సంఖ్యలో వున్నాయి. వారికి తుపాకు లున్నాయి. రాజమహేంద్రవరంలో దిగాడు బుస్సీ! సేనాధిపతి హైదరీలా చాల కఠినుడంట.

ఎందుకొచ్చిన తగవులయ్యా మరదీ! మనవారినికూడా రాయబారం పంపితే పోదా!" అన్నది కమలక్క.

అందాకా నవ్వుతున్న వెంగళరాయడు చురచుర చూశాడు. ముఖం మందార వర్ణం దాల్చింది. అసంకల్పితంగానే చేయి పచ్చలపిడిబాకు మీదికి పోయింది.

"వదినగారూ! వెలమవీరుల పౌరుష పరాక్రమాలను శంకిస్తున్నారా మీరు!"

అన్నాడు రోషంగా

"నాయనా! వెంగళరాయడా! రాజనీతి వేరు. పరాక్రమం వేరు. మనకు అయిదు వందలకు మించిన సైన్యం లేదు. వారు పదివేల మంది. ఎంత పరాక్రమవంతు లయినా అయిదువందల మంది పదివేల మంది మీద యుద్ధం చెయ్యగలరా! వారికి తుపాకులున్నాయి. మనకు చువ్వీ చెలు, వచ్చల పిడిబాకులూ వున్నాయి. తుపాకులతో పిడిబాకులు పోరాడగలవా! ఆలోచించి నిర్ణయించు మరదీ!

ప్రస్తుతాన్ని మరచి పరాక్రమంసంగతి ఆలోచించకు. మీరు పరాక్రమశాలురు కారని ఎవ్వరూ అనలేరు. కాని చెట్ల చాటున నిలచి సైనికులు గుండ్ల వర్షం కురిపిస్తే నీ పిడిబాకులతో ఎవరిని పడకుమ్మ గలవు? పదివేలమందిపరాసుమూకలముందు బొబ్బిలి రాజ్యలక్ష్మి ఎన్ని అవమానాల పాలవుతుందోరవంత ఆలోచించవయ్యా!" అన్నది కమలక్క ప్రతిమాలుతున్నట్లు.

అయినా ఆ మాటలు వెంకళరాయని చెవికెక్కలేదు.

"వెలమ వనితల్ని బొందిలీ వీరులకు వార కాంతలుగా బహూకరిస్తా నన్నాడు విజయరామరాజు. ఆ మాట అన్నందుకు అతడి నాలుక చీలుస్తాను. అతడి రక్తంతో బొబ్బిలి భూముల్ని తడుపుతాను. అతడి పేగుల్ని వీర జంధ్యాలుగా ధరిస్తాను. ఇది నా శపథం.

మా యిద్దరిలో ఎవరి శపథం నెరవేరుతుందో రణక్షేత్రంలోనేకదా తెలుస్తుంది. కాబట్టి వొదినగారూ! యుద్ధం అనివార్యం!" అంటూ మరొక మాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అక్కడ నించి వెళ్ళిపోయినాడు వెంగళరాయడు.

అతని మొండిపట్టుదలకు బొగిలిబొగిలి ఏడ్చింది కమలక్క. ప్రభువుల పట్టుదలలకు ప్రజల రక్తం నేలపాలు కావలసిందేనా? వారి పౌరుషపరాక్రమాలు ప్రదర్శించుకోవటం కోసం వీరభూమి బొబ్బిలి నిర్వీర్యం కావలసిందేనా?—అని ఆలోచించిందామె. ఫలితాంశాలేమిటి? అని ప్రశ్నించుకుంటే కన్నీరు పొంగి వచ్చింది.

పరుగు పరుగున వెళ్ళి ప్రభువులయిన గోపాలకృష్ణరంగారావుగారి ముందు నిలిచింది.

"ప్రభూ! ఈ దుస్థితి యేమిటి?" అని సూటిగా ప్రశ్నించింది ఆమె అంతర్యాన్ని గ్రహించిన గోపాలకృష్ణ రంగారావు నిస్సహాయంగా చూశాడు. విషాద పూర్ణంగా పెదవి విరిచారు.

"వదినగారూ! శపథాలు నెరవేర్చుకోవటంకోసమే రాముడు అరణ్యాలకు వెళ్ళాడు. ద్రౌపది భారతయుద్ధం జరగాలని కోరింది. వారికన్నా మనం గొప్పవారమా! ఆశపథాలకోసమే బొబ్బిలి యుద్ధం జరుగనుంది. ఎవరు ఎంత బాధపడినా జరుగనున్నది జరుగక మానదు. మీ ఆవేదననూ ఆరాటాన్ని మేం అర్థం చేసుకోగలం. ఈ బొబ్బిలి యోగక్షేమాల కోసం యింతగా బాధపడుతున్న మీకు మా శతాధిక వందనాలు.

నా శక్తి వున్నంతవరకూ శాంతి కోసమే ప్రయత్నిస్తాను ఇంతకుమించి నేనేమి చెప్పగలను." అని బదులిచ్చారు గోపాలకృష్ణరంగారావు.

కదలిపోతున్న కన్నీటి కావేరిలా వెళ్ళిపోయింది కమలక్క చివరి ప్రయత్నంగా ఇనుగంట నరసారాయని కలుసుకుంది. ఆయన మహామంత్రి. మహామేధావి.

కమలక్క హృదయగతమయిన బాధను ఆయన చక్కగా అర్థం చేసుకున్నాడు. తనూ బాధపడ్డాడు.

"కమలక్కా! ఈ బొబ్బిలి గురించి నువ్వు పడుతున్న ఆవేదన నాకు అర్థమవుతోంది. నిజం చెప్పాలంటే బొబ్బిలి ప్రభువులకు నిన్నుమించిన ఆప్తులు లేరు.

కాని ఇప్పటి స్థితిలో నీమాటలుసాగవు. చరిత్రగతిలో కొన్ని అనివార్యమయిన పరిణామాలుంటాయి వాటిని ఎవరూ ఆపలేరు. అలాంటిదే బొబ్బిలిలో జరుగనుంది' అన్నారాయన.

కమలక్క ఆవేదనతో కమిలి కుమిలి ఏడ్చింది పిచ్చిదానిలా రోజులతరబడి అడవులవెంట తిరిగింది.

ఆఖరుకు ఒక నిర్ణయానికి వచ్చింది.

దేవులపల్లిలో ఫ్రెంచి సైన్యాలు విడిది దిగాయి బుస్సీ బొబ్బిలి గురించి మండిపడుతున్నాడు. అతడికి దుబాసీగాపని చేస్తున్న హైదరు జంగుకు లంచం యిచ్చి బొబ్బిలి మీద కొండీలు చెప్పించాడు కళింగ పెదరాజు విజయరామరాజు.

పదివేల పరాసుమూక ఎస్తూవుంటే బొబ్బిలి కోట గోడలు గజగజ వణికాయి వెలమవీరుల పంతాలు రవంత సడలలేదు. ఆత్మాహుతికి అందరూ సిద్ధమయినారు.

కమలక్క నేత్రాలు విశాలమయినాయి కన్నులు నెగడులా మండుతున్న చింత నిప్పుల్లాఅయినాయి. ముఖం కావిరంగులో తూర్పున పొడుస్తున్న పొద్దులా అయింది.

బొబ్బిలి బెబ్బులి అయింది కమలక్క.

ధైర్య సాహసాలుగల కోమటి వారింటి ఆడపడుచుల్నీ, వెలమ వనితల్నీ సమీకరించి సైన్యంగా తీర్చి దిద్దిందామె పరాసుమూకలు ఎప్పు డెప్పుడొస్తాయా అని ఎదురు చూస్తోంది.


కోళ్ళవ్యాధులు
ప్రథమ ముద్రణ
వెల రూ. 12/-

Dr. R. శ్రీనివాసరావు B.V.Sc  Dr. P. శ్రీరాములు M.V.Sc
• వైరస్, బాక్టీరియా, ఫంగస్, కొన్ని ఇతర వ్యాధుల చికిత్స
• వ్యాధి నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలు
• కోళ్ళ షెడ్లు, లిట్టరు, మందులవాడకం కొన్ని ముఖ్య విషయాలు
• వ్యాధి నిరోధక టీకాలు - చేసే పద్ధతి

కోళ్ళపరిశ్రమ

మూడవ ముద్రణ
వెల రూ. 15/-
Dr. G. సుబ్బారావు B.V.Sc
• కోళ్ళ పెంపకం - కొన్ని ముఖ్య విషయాలు
• కోళ్ళ దాణా - సాధారణ కోళ్ళ వ్యాధులు జాగ్రత్తలు
• ప్రభుత్వ ఉపాధి కల్పన పథకాలు బ్యాంకు ఋణ సౌకర్యాలు
• కోళ్ళ పెంపకంలో ఆదాయ - వ్యయ పట్టికలు

కుక్కలు సంరక్షణ పెంపకం
ప్రథమ ముద్రణ
వెల రూ. 8/-

Dr. R. శ్రీనివాసరావు B.V.Sc
• కుక్కల ఆవిర్భావము - రకములు - కొన్ని ఫోటోలు
• కుక్క పిల్లను ఎంచుకొనుట - వాటి ప్రవర్తన - ట్రైనింగ్
• చూడి కుక్కలు - పెద్ద వయస్సు కుక్కల పోషణ
• కుక్కల ఆహారం - ఆరోగ్యం
DOLPHIN
పుస్తకం ఖరీదు ముందుగా M.O. చేసిన వారికి పోస్టు ఖర్చులకు V.P.P ద్వారా పంపుతాం
నవోదయ పబ్లిషర్స్ బుక్ సెంటర్
ఏలూరు రోడ్డు, విజయవాడ-2. ఫోన్ 62222

అది పదిహేడవ శతాబ్దంలో అయిదు పదులు నిండాక ఏడవ సంవత్సరం. జనవరి నెల. యిరవై మూడవ రోజు. అర్ధరాత్రి.

పరాసుమూకలు బొబ్బిలి కోట వెనుకనున్న అడవిలోకి వచ్చాయి. ఫిరంగులను పొదల చాటున అమర్చుకుంటున్నాయి.

ఈ వార్త విన్న కమలక్క నేత్రాలు విశాలమయినాయి. చీరచెరుగును రొంటిన దోపుకుంది. ఒడినిండా రాళ్ళునింపుకుంది. అలాగే చేయమని కోమటి కాంతలను, వెలమ వనితలనూ ప్రోత్సాహపరిచింది.

బొబ్బిలిలోని బెబ్బులులా అన్నట్లు వడతుల సైన్యం కదలింది. వనమాలమ్మ ఆలయంలో దూరి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు అమ్మవారి పాదాల మీద వున్న పూజా కుంకుమను పిడికిట పట్టి లలాటాన అద్దుకుంది కమలక్క.

నుదురు ఎత్తయిన అగ్ని వేదికలా మండుతోంది. కళ్ళలో నిండిన కోపారుణిమ కుంకుమ వర్ణంతో పోటీ పడుతోంది. చేతిలోని రోకలిని బిగించి పట్టుకుందామె. ఒడిలోని రాళ్ళను మరొక్కమారు సరిచూసుకుంది.

"జై గోపాలదేవా" అంటూ పెద బొబ్బపెట్టి ముందుకు కదిలిందామె.

పరాసుమూకలు పరాకున వున్నాయి. అర్ధరాత్రి అయింది కదాఅని ఆయుధాలను ప్రక్కన పెట్టుకున్నారు సైనికులు. వారిమీద మెరుపుదాడి చేసింది కమలక్క.

ఆయుధాలు అందుకునేఅవకాశంకూడా లేకుండానే పరాసు సైనికుల తలలు పుచ్చకాయల్లా పగులుతున్నాయి। వనితా సైన్యం విజృంభించింది.

రోకళ్ళతో, రాళ్ళతో పరాసుమూకల మీద అనూహ్యమయిన రీతిలో దాడి చేసింది. పరాకున వున్న పరాసు సైనికులు కలగుండుపడిపోయినారు

జరుగుతున్న దేమిటోతెలియలేదు. ఆడవారి గొంతులు అన్ని దిక్కులనుంచివినిపిస్తున్నాయి.

"గోవిందా। గోపాలదేవా!!" అంటూ కమలక్క పలనాటి నాగమ్మలా, రాణి రుద్రమ్మలా పోరుతోంది. ఈ వార్త బుస్సీకి చేరి అతడు ఆజ్ఞలు ఇచ్చేలోగా వచ్చిన వనితా సైన్యం వచ్చినట్లే మాయమయింది.

కాగడాలు వెలిగించి అన్ని దిక్కులా గాలించారు. ఎక్కడా ఏమీ కన్పించలేదు. నీరు కారిపోయినాడు హెన్రీలా! తొలి విజయం బొబ్బిలివారిదే అయింది.

వనమాలమ్మ గుడిలో తల దాచుకున్న కమలక్క తృప్తిగా నిట్టూర్చింది. మరుక్షణంలోనే మరునాడు జరుగనున్న దురదృష్టకరమయిన ఘట్టాలు ఆమె కనుల ముందు కదలాడినాయి. దిగులుమూటకట్టినట్టుగా అయిందామె. ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా! ఎప్పుడెప్పుడు యుద్ధం ఆరంభమవుతుందా। బొబ్బిలిగడ్డ నీరు త్రాగిన ఋణం ఎప్పుడెప్పుడు తీర్చుకోగలనా అని ఎంతో ఆత్రుతతో ఎదురుచూసింది.

"గోపాలదేవా! బొబ్బిలి ప్రభువులను కాపాడు. నన్నెంతో ఆదరంతో చూసిన ప్రభువుల రుణం తీర్చుకునేలా నన్ను ఆశీర్వదించు. నాకు మనోధైర్యాన్ని ప్రసాదించు" అని గోపాలదేవుని పదే పదే ప్రార్థించింది.

తెల్లవారింది. తూర్పున అరుణ కాంతులు పరుచుకున్నాయి పరాసువారు మ్రోగించిన నగార మ్రోతలకు బొబ్బిలి వారి ముఙుకులు బదులు పల్కినాయి కోడి స్తంభం గడగడ వణుకుతోంది.

కోటలో కలకలం ప్రారంభమయింది. ఫిరంగులు ప్రేలుతున్నాయి. నామమాత్రంగా నిర్మితాలయిన బొబ్బిలి కోట గోడలు పడిపోతున్నాయి.

కమలక్క కసిగా చూసింది

"ఇంకేముంది. అంతాఅయిపోయింది బొబ్బిలి వెలమవీరుల రక్తంతో బొబ్బిలి భూములు తడిసే దురదృష్టకరమయిన ఘడియలు ఆసన్నమయినాయి. భవితవ్యమంతా అంధకార బంధురంగా కన్పిస్తోంది. తాను ప్రేమించిన జన్మభూమి, తనకు ప్రాణవాయువు లందించిన పవిత్రభూమి పరాసుమూకల వశం కానుంది. ఇంక ఆలోచించి ప్రయోజనం లేదుఅనుకుందామె.



పంచాంగ పఠనం

చిత్రం : ఆర్. విశ్వనాథం, విల్లివాకం

వనమాలమ్మ చేతిలోని త్రిశూలాన్ని సర్రున లాగి చేత పట్టుకుంది. కసిపట్టిన కాలసర్పంలా వురవళ్ళ పరవళ్ళతో వెళ్ళి బుస్సీసైన్యాలమీద పడింది.

అల్లంతదూరం నించే గమనించాడు హెన్రిలా!

ఇంతవరకూ బొబ్బిలి కోటలోనుంచి ఒక్క వీరుడయినా వెలుపలకు రాలేదు. ఫిరంగి దెబ్బలకు కోటగోడలు శిథిలమవుతున్నాయి. ఫిరంగి మ్రోతలకు గుండెలు దడదడలాడుతున్నాయి. మృత్యుకుహరం లాంటి పరాసు ఫౌజుమధ్యకు వింటవిడిచిన బాణంలా, వడిసేల వడిసెన రాయిలా దూసుకువస్తున్న స్త్రీమూర్తిని చూశాడు సేనాధిపతి

దారితప్పలేదుకదా! భయంవల్ల పరుగు పెట్టటం లేదు కదా అని క్షణం ఆలోచించాడు.

"ఎవరామె?" అని అడిగాడు

"కమలక్క" అని బదులిచ్చాడొక బొందిలీ సైనికుడు "ఆమె చేతిలోని త్రిశూలం యమదండమే।" అని హెచ్చరించాడు.

ఆ సాహస స్త్రీ మూర్తిని చూసి అచ్చెరువు పడిపోయినాడు హెన్రీలా! ఎంతో బాధపడ్డాడు ఆజ్ఞ యిచ్చేందుకు

అయినా తప్పదు. యుద్ధ నీతి ముందు మానవత మరుగున పడిపోయింది, దయా దాక్షిణ్యాలు ఇంకిపోయినాయి

ప్రక్కనున్న సిపాయి భుజం మీద చేయిపెట్టి తట్టాడు. సిపాయి బందూకును గురి పెట్టాడు.

"ఫైర్" అని అరిచాడు సేనాధిపతి హెన్రీలా! ఛెళ్ళున మోత పుట్టిస్తూ గుండు దూసుకుపోయింది కమలక్క గుండెల్లోంచి. కమలక్క బెబ్బులిలా చూసింది.

చేతిలోని త్రిశూలాన్ని ఆ సైనికుని గుండెలకు గురిపెట్టి కసిగా విసిరింది. దాంతో పరాసువాడు పరలోకానికి ప్రయాణం కట్టాడు. ఆడ బెబ్బులి పగ తీర్చుకుంది.

మరుక్షణమే రక్తపు మడుగులో పడిపోయింది అంతటితో కోమటివారి కమలక్క బొబ్బిలి భవితవ్యాన్ని గురించి కంటున్న కలలూ, బొబ్బిలి భవితవ్యం మీద పెట్టుకున్న ఆశలూ తగలబడిపోయాయి.

బొబ్బిలివారికి తొలివిజయం తెచ్చిపెట్టిన కమలక్క తానే తొలికబళం కూడా అయింది. పాపం బొబ్బిలి బెబ్బులి!!